7

సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



కాఫీలో అధిక దిగుబడి సాధించాలి

ప్రకృతి విధానంలో కాఫీని సాగు చేసి అధిక దిగుబడి పొందేందుకు మెలకువలు పాటించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ ఆర్‌పీసీ కృష్ణారావు సూచించారు. 8లో

న్యూస్‌రీల్

ఘనంగా కార్తీక దీపార్చన



పాడేరులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపార్చన

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని శివాలయాల్లోను ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవస్వామిని దర్శించుకున్నారు. శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం సహస్ర కార్తీక దీపార్చనను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అరకు భ్రమరాంబికదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షంతో మ్యాచ్‌లు రద్దు

- ఆధిక్యంలో విదర్భ

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. టాస్ వేయకుండానే మ్యాచ్‌లు రద్దయినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గ్రూప్ డీలో భాగంగా చత్తీస్‌గఢ్‌తో ఒడిశా, విదర్భతో రైల్వేస్ జట్లు తలపడాల్సి వుండగా.. మ్యాచ్‌లు రద్దు కావడంతో జట్లకు రెండేసి పాయింట్లు కేటాయించారు. దీంతో ఒడిశా రెండు పాయింట్లు సాధించగలిగింది. విదర్భ 14 పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. అసోం, చండీగఢ్ జట్లు 12, పుదుచ్చేరి 8, రైల్వేస్, చత్తీస్‌గఢ్ జట్లు 6 పాయింట్లతో తదుపరి మ్యాచ్‌లు ఆడనున్నాయి. 3న అసోంతో ఒడిశా, చండీగఢ్‌తో రైల్వేస్ తలపడనున్నాయి.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తెడబారికి సురేష్‌కుమార్



గురుకుల ఉద్యోగుల రిలే దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత సురేష్‌కుమార్

సాక్షి,పాడేరు: గిరిజన సంక్షేమ గురుకుల కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ అధ్యాపకులు,ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తెడబారికి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట వారు చేపట్టిన రిలేదీక్షల్లో ఆదివారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సమాన పనికి సమాన వేతనం, న్యాయసమ్మతమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు.

జీవామృతం తయారీపై విద్యార్థులకు అవగాహన



జీవామృతం తయారు చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

చింతపల్లి: స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో జీవామృతం తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మూడో సెమిస్టర్‌లో పరిశోధనస్థానంలో క్షేత్రస్థాయిలో సాగు విధానాలపై అవగాహన పొందాల్సి ఉంది. దీనిలో భాగంగా ఆదివారం పంటలకు ఉపయోగించే ఘన జీవామృతం, కషాయం తయారీపై టీచింగ్ అసోసియేట్ కె.బాలాజీ అవగాహన కల్పించారు. దీనివల్ల సేంద్రియ విధానంలో సాగు పద్ధతులపై వారికి పూర్తి పరిజ్ఞానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



హుకుంపేట మండలం బూరుగుపుట్టులో దెబ్బతిన్న రాజ్‌మా పంట



సంతారి ప్రాంతంలో వర్షం నీటిలో వరి పనలు

చివరి ఆశలపై నీళ్లు

నారు పోసి.. నీరు పెట్టి.. దమ్ముచేసి.. నాట్లు వేసింది మొదలు పండిన పంట ఇంటికొచ్చేంత వరకూ అన్నదాతకు హైరానే. పంట కోత, నూర్పిడి పనుల్లో నిమగ్నమైన రైతులను ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి సాగు విస్తీర్ణంలో సుమారు 50 శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగతా పంట కోతకు సిద్ధంగా ఉంది. పంట చేతికి అందేవేళ ప్రకృతి తమ ఆశలపై నీళ్లు చల్లుతోందని గిరి రైతులు వాపోతున్నారు.

- గిరి రైతుల గుండెల్లో గుబులు రేపుతున్న వర్షాలు
- వరి, చిరుధాన్యాల పంటలకు నష్టం
- దయనీయంగా రాజ్‌మా రైతు పరిస్థితి
- పెట్టుబడి దక్కే పరిస్థితి లేని వైనం

సాక్షి,పాడేరు: తుపాను ప్రభావంతో ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలు గిరి రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ముఖ్యంగా ప్రధానపంటలైన వరి, రాజ్‌మా, చిరుధాన్యాలకు నష్టం కలిగించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పంట చేతికందే వేళ కురుస్తున్న వర్షాలు వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. జిల్లాలో 52 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పైరు పక్వదశకు చేరింది. ఇప్పటివరకు జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో 50శాతం మాత్రమే వరి కోతలు జరిగాయి. తుపాను హెచ్చరికలతో అప్రమత్తమైన చాలా మంది రైతులు పొలాల్లోని వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పారు. మిగిలిన పొలాల్లో పైరు కోతకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గింజ తడిచిపోయి ముక్కి పోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.



బస్కీ ప్రాంతంలో వరి కుప్పలపై గిరిజనులు కప్పిన టార్పాలిన్లు



హుకుంటపేట ప్రాంతంలో పొలాల్లో ఉన్న వరి పనలు

చిరుధాన్యాలపై ప్రభావం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు చిరుధాన్యాల పంటకు నష్టపరిచే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 30 వేల హెక్టార్లలో రాగులు, సామలు, కొర్ర తదితర చిరుధాన్యాలను 30 వేల హెక్టార్లలో సాగు చేపట్టారు. ఇప్పటివరకు 50 శాతం మేర మాత్రమే కోతలు జరిగాయి. మిగతా ప్రాంతాల్లో కోతలు చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో ప్రకృతి తుపాను రూపంలో పగబట్టిందని రైతులు వాపోతున్నారు. వర్షాలకు గింజ తడిచిపోవడం వల్ల నాణ్యత దెబ్బతినే పరిస్థితి ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. మన్యంలో పండించే చిరుధాన్యాలకు మంచి డిమాండ్‌తోపాటు ధర కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో నాణ్యత తగ్గితే దాని ప్రభావం ఆదాయంపై చూపుతుందని గిరి రైతులు వాపోతున్నారు.

రాజ్‌మాకు తప్పని నష్టం

రాజ్‌మా పంటకు నష్టం తప్పే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో 9,500 హెక్టార్లలో సాగు చేస్తుండగా దీనిలో సుమారు 3వేల హెక్టార్లలో తొలకరి ప్రారంభంలో విత్తనాలు చల్లారు. ఇప్పుడు ఆ పైరు దిగుబడి దశకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రాజ్‌మా కాయలు నానిపోవడంతో గింజకు బూజు పట్టే అవకాశం ఉంది. కొన్నిచోట్ల మొలకెత్తే పరిస్థితి ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొయ్యూరు: మండలంలో ఆదివారం కురిసిన మోస్తరు వర్షానికి వరి పనలు తడిచిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అరకులోయ టౌన్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి పనలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని బస్కీకి చెందిన రైతు మజ్జి కార్తీక్ వాపోయాడు. పొలాల్లోంచి వరి పనలను ఒడ్డుకు తరలించి కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పామని అదే ప్రాంతానికి చెందిన రైతులు బురిడి గాసి, అర్జున్ తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పంటనష్టాన్ని గుర్తించి పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

పెట్టుబడి పోయినట్టే



హుకుంపేట మండలం మారెల గ్రామానికి చెందిన ఈ రైతు పేరు కాకర శ్రీను. అర ఎకరా భూమిలో రాజ్‌మా సాగు చేపట్టాడు. సొంత విత్తనాలు 25 కిలోలు వినియోగించాడు. విత్తనాలు చల్లిన దగ్గరనుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో పైరు పక్వ దశకు చేరుకుంది. కోత మొదలుపెడతామన్న తరుణంలో తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం దెబ్బతింది. కాయలోపల గింజలు మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల పెట్టుబడి రూ.3 వేలు కూడా దక్కే పరిస్థితి లేకుండా పోయిందని శ్రీను వాపోయాడు. రాజ్‌మా రైతుల్లో చాలా మంది రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

రైతన్నలూ ఇలా చేయండి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి పంటను కాపాడుకునేందుకు రైతులు సూచనలు పాటించాలని జిల్లావ్యవసాయాధికారి నందు సూచించారు. తడుస్తున్న వరి పనలపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. కోసిన వరిపనలు నీటి ముంపునకు గురి కాకుండా పొలం గట్లపైకి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పంట కోతకు సిద్ధంగా ఉన్న పొలాల్లో వర్షం నీరు పోయేలా కాలువలు తీయాలని సూచించారు చిరుధాన్యాల పంటల విషయంలోనూ ఇవే జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు అంతరాయం

రాజవొమ్మంగి: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా రెండు రోజులుగా ధాన్యం కొనుగోళ్లకు అంతరాయం ఏర్పడిందని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ గణేష్‌కుమార్ తెలిపారు. ఇప్పటివరకు రంపచోడవరం డివిజన్‌లో 6,200 హెక్టార్లలో వరి సాగు చేపట్టగా, 700 హెక్టార్లలో కోతలు జరిగాయన్నారు. ఇందుకూరు, ఇందుకూరుపేట, జడ్డంగి కేంద్రాల్లో మాత్రమే 256 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆటంకం కలిగించాయన్నారు. ధాన్యం బాగా ఎండబెట్టి, తేమ తగ్గిన తరవాత మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలని సూచించారు. రైతులు పొడి వాతావరణంలో మాత్రమే కోతలు ప్రారంభించాలని ఆయన సూచించారు.

రైతులను అప్రమత్తం చేశాం




జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల జరుగుతున్న పంట నష్టంపై అంచనా వేస్తున్నాం. 50 శాతం మేర వరికోతలు పూర్తయినా 20 శాతం పంటను మాత్రమే రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలించగలిగారు. మిగతా రైతులు రక్షణ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంట పాడవకుండా చేపట్టాల్సిన సస్యరక్షణపై గిరిజన రైతులను అప్రమత్తం చేశాం. దిగుబడికి సిద్ధంగా ఉన్న రాజ్‌మా పైరుపై వర్షాలు ప్రభావం చూపే అవకాశం ఉంది.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

ప్రేమ విఫలమై చనిపోతున్నా..

- సూసైడ్ నోట్‌లో మృతుడు
- కేసు నమోదు చేసిన పోలీసులు



సుబ్రహ్మణ్యం జేబులో లభ్యమైన సూసైడ్ నోట్



ఉరి వేసుకుని మృతి చెందిన సుబ్రహ్మణ్యం

ముంచంగిపుట్టు: మండలంలోని దార్లెలో శనివారం మామిడి చెట్టుకు ఉరివేసుకుని యువకుడు సుబ్రహ్మణ్యం ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు దుస్తులు తొలగిస్తుండగా ప్యాంట్ జేబులో సూసైడ్ నోట్ లభ్యమైంది. ప్రేమ విఫలమై బాధతో చనిపోతున్నట్టుగా అందులో పేర్కొన్నా డు. ఇలావుండగా సుబ్రహ్మణ్యంకు మరో యువతితో మూడేళ్లపాటు ప్రేమ నడిచిందని, పెళ్లి చేసేందుకు మాటలు కూడా జరిగాయని, ఆ తరువాత పెళ్లి రద్దవడంతో అప్పటినుంచి మానసికంగా ఇబ్బందికి గురయ్యేవాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అందువల్లనే ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆరోపించారు. దీనిపై ఎస్‌ఐ రామకృష్ణ ఆదివారం దార్లెల గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రేమ విఫలం కారణంగానే సుబ్రహ్మణ్యం ఆత్మహత్య చేసుకున్నట్టుగా ప్రాథమికంగా నిర్ధారించామని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చని కూటమి



డుంబ్రిగుడ మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మత్స్యలింగం

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శ
- చంద్రబాబు పాలనలో బాదుడే బాదుడని ధ్వజం

అరకులోయ టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలను నెరవేర్చలేకపోయిందని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. ఆదవారం ఆయన టీటీడీ కల్యాణ మండపంలో మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి సమష్టిగా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఎటువంటి సమస్యలున్నా నాయకులు, కార్యకర్తలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో బాదుడే బాదుడన్నారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచమని చెప్పి ఆరు నెలల్లో రెండుసార్లు పెంచారన్నారు. అనంతరం ఆయనను పార్టీ మండల నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ చటారి జానకమ్మ, ఎంపీపీ బాక ఈశ్వరి, సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు మల్లేష్, పార్టీ పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

- డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

హుకుంపేట: శిశు మరణాలు జరగకుండా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని ఉప్ప ప్రభుత్వ ఆస్పత్రి పరిధి లివిటి గ్రామాన్ని సందర్శించారు. చిన్నపిల్లలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నపిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా నాటువైద్యం, భూతవైద్యులను ఆశ్రయించవద్దన్నారు. పసరమందులు వినియోగించడం వల్లే మాతా శిశు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మూఢనమ్మకాలకు, నాటువైద్యానికి దూరంగా ఉండాలని కోరారు. గ్రామాలోల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యసిబ్బందికి సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి జి.సింహాద్రి, క్షయ పర్యవేక్షకుడు సదానందం పాల్గొన్నారు.

మైదాన ప్రాంతానికి బదిలీ కోసం..

- ఏజెన్సీకి వెళ్లిన ఉపాధ్యాయులు ఆందోళన పర్వం
- విశాఖలో సమావేశమైన ఉపాధ్యాయులు
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ



గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన ఉపాధ్యాయులు

విశాఖ విద్య: ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. ఆదివారం గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులంతా సమావేశమయ్యారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 420 మంది ఉపాధ్యాయులను అనివార్యంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు. వీరిలో 50 ఏళ్లకు పైబడినవారు, రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న వారే ఎక్కువగా ఉన్నారు. 200 మందికి పైగా మహిళా ఉపాధ్యాయులు ఉండటంతో వీరంతా తిరిగి మైదాన ప్రాంతాలకు ఎప్పుడు వస్తామా అని ఎదురుచూస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం బదిలీల చట్టం చేస్తుందనే ప్రచారంతో ఇక తామంతా ఏజెన్సీలోనే ఉండాల్సి వస్తుందేమోననే ఆందోళనతో ఉపాధ్యాయులు పోరుబాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన రెండు వందల మంది వరకు ఉపాధ్యాయులు విశాఖలో ఆదివారం సమావేశమయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఏజెన్సీలో మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులు చొప్పున నాయకత్వం వహించేలా, భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాల్లో మిగతా వారందరినీ భాగస్వామ్యులను చేసేలా నిర్ణయించారు. త్వరలో చేపట్టబోయే బదిలీల్లో తమకు ప్రాధాన్యం ఇచ్చి, మైదాన ప్రాంతానికి తిరిగి పంపించేలా వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణకు సిద్ధం కావాలని తీర్మానించారు.

మురిసిన పర్యాటకం

జోరువానలోనూ తరలివచ్చిన సందర్శకులు



పర్యాటక కేంద్రం కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న సందర్శకులు

డుంబ్రిగుడ: జోరువానలోను పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. చాపరాయి జలవిహారి, అంజోడలోని అరకు పైనరీకి సందర్శకులు భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. వనభోజనాలు నిర్వహించారు. బాంబూ చికెన్, బాంబూ బిర్యానీ అమ్మకాలు భారీగా జరిగాయి. తుపాను కారణంగా శీతల గాలులు వీస్తున్నా పర్యాటక రంగంపై ఏమాత్రం ప్రభావం చూపలేదు.

చెరువులవేనంకు తాకిడి

చింతపల్లి: ప్రముఖ పర్యాటక కేంద్రం లంబసింగికి ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. తుపాను ప్రభావం ఉన్నప్పటికీ సందర్శకులతో సందడిగా మారింది. చెరువుల వేనం వ్యూపాయింట్‌కు తాకిడి నెలకొంది. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. తాజంగి జలాశయం వద్దకు భారీగా తరలివచ్చారు.

జి.మాడుగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతానికి సందర్శకులు భారీగా తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రత్యేక వాహనాల్లో రావడంతో సందడి వాతావరణం నెలకొంది. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.



చాపరాయి సమీపంలో వంట చేస్తున్న పర్యాటకుల కుటుంబ సభ్యులు



చాపరాయి జలవిహారి వద్ద పర్యాటకుల సందడి



వర్షంలోనూ చాపరాయి జలవిహారికి తరలివచ్చిన పర్యాటకులు



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



నేటి నుంచి 41 రోజుల మండల దీక్ష

12 నుంచి 32 రోజుల దీక్ష

సింహగిరిపై దీక్షాధారులకు మాలధారణ

జనవరి 12న రెండు దీక్షల ముగింపు

శ్రీనృసింహ దీక్ష.. సర్వ జగద్రక్ష





మహిమాన్వితమైనది శ్రీ నృసింహ దీక్ష



శ్రీ నృసింహ దీక్ష ఎంతో మహిమాన్వితమైనది. శ్రీనృసింహ దీక్షలు దశదిశలా విస్తరించాలని, దీక్షలు తీసుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగాలని పీఠం తరఫున విశేషంగా కృషి చేస్తున్నాం. దీక్షధారుల కోరిక మేరకు 2015 నుంచి దేవస్థానం శ్రీనృసింహ దీక్షలను అధికారికంగా నిర్వహిస్తుండటం సంతోషంగా ఉంది. ఈ ఏడాది మా పీఠం తరఫున ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 1,000 మంది వరకు మండల దీక్ష చేపడుతున్నారు.

– సానబోయిన రాజు, గురుస్వామి, శ్రీ చందన పెరుమాళ్ పీఠం, సింహాచలం

సింహాచలం: ఈ ఏడాది శ్రీ నృసింహ దీక్షల స్వీకరణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామిని దీక్షలతో కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. తిథులను అనుసరించి దేవస్థానం అధికారులు తేదీలను నిర్ణయించగా.. సోమవారం నుంచి 41 రోజుల మండల దీక్ష, ఈ నెల 12వ తేదీ నుంచి 32 రోజుల దీక్ష ప్రారంభవుతుంది. ఈ నేపథ్యంలో మండల దీక్ష ఆచరించే భక్తులకు సింహగిరిపై ఉదయం 7 గంటలకు దేవస్థానం వైదికులు మాలధారణ చేస్తారు. వచ్చే ఏడాది జనవరి 12న దీక్షధారులంతా దీక్ష విరమించాల్సి ఉంటుంది.

పోరాట ఫలితంగా..

సింహాచలం దేవస్థానం 2015 నుంచి శ్రీ నృసింహ దీక్షలను అధికారికంగా నిర్వహిస్తోంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దీక్షతో కొలవాలని అడవివరానికి చెందిన కొందరు భక్తులు సుమారు 21 ఏళ్ల కిందట సంకల్పించారు. చందన దీక్షగా నామకరణం చేసి.. ఒక పీఠంగా ఏర్పడి దీక్ష ప్రారంభించారు. అలా ఏడాదికేడాదికి దీక్షాధారులు పెరిగారు. దానికణుగుణంగానే పీఠాల సంఖ్య కూడా పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాలైన ముంచంగిపుట్టు, హుకుంపేట, దుంబ్రిగుడ, అరకు, జి.మాడుగుల, పాడేరు, చెరువుపాకల, పెదగూడ, కుమ్మరిపుట్, చోడవరం, మాడుగుల, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు దీక్ష తీసుకోవడం ప్రారంభించారు. ఒడిశాలోని ఛత్రపూర్, బరంపురం, గోపాలపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, తెలంగాణకు చెందిన పలువురు భక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే చందన దీక్షలను అధికారికంగా నిర్వహించాలని దీక్షాధారులంతా సింహాచలం దేవస్థానం అధికారులను కోరారు. దీనిపై పోరాటం కూడా చేశారు. ఎట్టకేలకు 2015లో చందన దీక్షలను శ్రీనృసింహ దీక్షలుగా నామకరణం చేసి దేవస్థానం అధికారికంగా ప్రారంభించింది. దీక్ష ముగింపు రోజున స్వామికి సమర్పించే ద్రవ్యాల మూటను తిరుముడిగా దేవస్థానం అర్చకులు నామకరణం చేశారు.

పీఠం ఏర్పాటు చేసే విధానం

దీక్షాధారులు స్వయంగా గానీ సామూహికంగా గానీ పవిత్రమైన ప్రదేశంలో పీఠాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక పీటపై విష్వక్సేనుడు, నృసింహస్వామి, లక్ష్మీదేవి, గోదాదేవి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రాతఃకాలంలో స్వామికి సుప్రభాత సేవ నిర్వహించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో విష్వక్సేన ఆరాధన, లక్ష్మీ అష్టోత్తరంతో లక్ష్మీదేవిపూజ, నృసింహ అష్టోత్తరంతో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పూజ చేయాలి. ధనుర్మాసం రోజుల్లో గోదాదేవిని పూజించాలి. పూజానంతరం స్వామి వైభవాన్ని కీర్తించాలి. రాత్రి పవళింపు సేవ నిర్వహించాలి.

పాటించాల్సిన నియమాలు

శ్రీనృసింహ దీక్షను తీసుకునే భక్తులు చందనం రంగు వస్త్రాలు ధరించాలి. నుదుటన తిరునామం ధరించాలి. బ్రహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలి. నది/తటాకం/బావి నీటితో స్నానం చేయాలి. బ్రహ్మచర్యం పాటించాలి.

తిరుముడి ద్రవ్యాలివే..

కొబ్బరి కురిడీలు, చందనం చెక్క, పట్టువస్త్రం, ఆవు నెయ్యి, ముద్ద కర్పూరం, యాలకులు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, కుంకుమ పువ్వు, పచ్చ కర్పూరం, జీడిపప్పు, కిస్‌మిస్, పటిక బెల్లంను తిరుముడిగా కట్టుకుని స్వామికి సమర్పించాలి.



మాలధారణ చేస్తున్న దేవస్థానం వైదికులు(ఫైల్)

మాలధారులకు సౌకర్యాలన్నీ కల్పిస్తున్నాం



శ్రీ నృసింహ దీక్షాధారులకు దేవస్థానం తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ నెల 2, 12 తేదీల్లో దీక్షలు స్వీకరించే వారికి సింహగిరిపైనే మాలధారణ చేస్తాం. తులసిమాల, స్వామి వారి ప్రతిమను దేవస్థానం ఉచితంగా అందిస్తుంది. దీక్ష రోజుల్లో అన్నప్రసాద భవనంలో మధ్యాహ్నం భోజనం అందిస్తాం. ఉచితంగా స్వామి దర్శనం కల్పిస్తాం. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుంది. జనవరి 12న దీక్ష విరమణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం.

–వి.త్రినాథరావు, ఈవో, సింహాచలం దేవస్థానం

275 కిలోల గంజాయి పట్టివేత

- రెండు ఆటోలు సీజ్
- ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలింపు



పెదబయలులో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసు సిబ్బంది

పెదబయలు : మండలంలోని పర్రెడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 275 కిలోల గంజాయి పట్టుకోవడం జరిగిందని జి.మాడుగుల సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ కె.రమణ అన్నారు. ఆదివారం ఉదయం ముందస్తు సమాచారం మేరకు పర్రెడ జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా ఒడిశా రాష్ట్రం నుంచి రూడకోట కొత్తాపుట్టు జంక్షన్ మీదుగా రెండు ఆటోల్లో తరలిస్తున్న 275 కిలోల గంజాయి పట్టుబడిందని తెలిపారు.

గంజాయితో పాటు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ డొలియం గ్రామానికి చెందిన దంబారు తుంగల్, ఇదే గ్రామానికి చెందిన మోహన్ కిముడు, పెదబయలు మండలం దుంబగుడ గ్రామానికి చెందిన కొర్రా బాబూరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే రెండు ఆటోలు, ఒక బైక్ సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో పోలీసు సిబ్బంది పర్రెడ వీఆర్వో కేశవకుమారి పాల్గొన్నారు.

కాఫీలో అధిక దిగుబడి సాధించాలి

ప్రకృతి వ్యవసాయ విభాగ స్టేట్ రిసోర్స్ పర్సన్ ఆర్‌పీసీ కృష్ణారావు

జి.మాడుగుల: ప్రకృతి విధానంలో కాఫీని సాగు చేసి అధిక దిగుబడి పొందేందుకు మెళకువలు పాటించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ ఆర్‌పీసీ కృష్ణారావు సూచించారు. ఆదివారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లాలం భాస్కరరావు, జిల్లా కాఫీ జేపీఈ రవీంద్ర అధ్యక్షతన మండలంలోని ఎం.నిట్టాపుట్టులో ఆదివారం కాఫీ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ, రైతుసేవ, ఉత్పత్తిదారుల మాక్స్ లిమిటెడ్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు.

కాఫీ పంట కోత దశలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కాఫీ మొక్కకు ఎర్రగా పండిన పండ్లను వాటి జిగురు 22 శాతం తేమ ఉండేలా పారామీటర్ మిషన్‌తో తెలుసుకుని సేకరించేలా శిక్షణ ఇచ్చారు. కాఫీ రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి, ఆదాయం సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేమన్నారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో గంగరాజు, మండల కాఫీ ఎంటీ యూనిట్ ఇన్‌చార్జిలు రామలింగం, మేడ ప్రసాద్, కృష్ణారావు, మహేశ్వరి, ఐసీఆర్పీలు కొండబాబు, కృష్ణమోహన్, రజియాబేగం,దమరి, ఎం రాంబాబు సన్యాసిరావు, కృపవరం, ఇమ్మానుయేల్, బాలకృష్ణ, ఎంపీటీసీ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అడవిలో ఒంటరిగా బాలుడు

తల్లిదండ్రుల చెంతకు చేర్చిన భద్రాచలం వాసి



బాలుడిని శుభ్రం చేస్తున్న జావీద్



తండ్రి చెంతకు చేరిన బాలుడు

చింతూరు: అడవిలో ఒంటరిగా తిరుగుతున్న నాలుగేళ్ల బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు భద్రాచలంకు చెందిన జావీద్. చింతూరు మండలం తులసిపాకలోని కొండరెడ్లకు చెందిన సొందల లింగారెడ్డి, బుల్లెమ్మల నాలుగేళ్ల బాలుడు ఆడుకుంటూ ప్రధాన రహదారిలో మారేడుమిల్లి వైపు సుమారు కిలోమీటరు దూరం నడుచుకుంటూ వెళ్లిపోయాడు. అదే సమయంలో రాజమండ్రి నుంచి కారులో తులసిపాక వైపు వస్తున్న జావీద్ ఆ బాలుడిని గమనించి కారును ఆపి బాలుడిని చేరదీశారు. బాలుడి ఒంటి నిండా ఉన్న బురదను శుభ్రంగా కడిగి బాలుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. కాగా బాలుడికి ఇంకా మాటలు రాక ఏమీ చెప్పలేక పోవడంతో చింతూరు పోలీసులకు అప్పగించాలని నిర్ణయించారు. వారు తులసిపాక వచ్చేసరికి రహదారి పక్కనే కొందరు మహిళలు బాలుడిని వెతకడాన్ని గమనించిన జావీద్ తన కారును ఆపి తన వద్ద ఉన్న బాలుడిని చూపించారు. వారు వెతుకుతున్నది ఆ బాలుడేనని చెప్పడంతో సదరు చిన్నారిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ బాలుడిని సురక్షితంగా తమకు అప్పగించిన జావీదుకు చిన్నారి తల్లిదండ్రులతో పాటు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

దిష్టికోసమని మొక్క కట్టబోతే..

- విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

చోడవరం రూరల్: గౌరీపట్నం గ్రామానికి చెందినకోరుకొండ లక్ష్మి అనే మహిళ ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. అమావాస్య దిష్టి కోసమని కలబంద మొక్కను ఇంటికి కట్టే సమయంలో సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ లైను తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై మేడపై నుంచి కిందకు పడిపోయింది. గమనించి చుట్టు పక్కలవారు చోడవరం సామాజిక ఆస్పత్రికి తరలించారు.పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు.మృతురాలి భర్త రెండు సంవత్సరాల క్రితం గ్రామాన్ని ఆనుకుని ఉన్న పెద్దేరు ఆవలి వైపున ఉన్న పొలాలకు వెళ్లే ప్రయత్నంలో నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించాడు. ఇప్పుడు భార్య లక్ష్మి మృతిచెందడడంతో బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం కాగా, వివాహిత అయిన కుమార్తె గాజువాక సమీపంలోని వడ్లపూడిలో అత్తవారింట ఉన్నారు. కుమారుడు జీవనోపాధి కోసం చెన్నైలో ఉన్నాడు.

ఉత్సాహంగా వైజాగ్ మారథాన్





మారథాన్‌లో పాల్గొన్న దివ్యాంగురాలు, ఔత్సాహికులు

ఏయూక్యాంపస్: నగర ప్రజల సంకల్పానికి ప్రకృతి సహకరించింది. విశాఖ వాసుల ఉత్సాహాన్ని చూసి వరుణుడు కరుణ చూపాడు. దీంతో ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించిన 'వైజాగ్ మారథాన్' ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సాహభరితంగా సాగింది. వైజాగ్ రన్నర్స్ సొసైటీ, సంధ్య మెరైన్ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో పార్క్ హోటల్ వద్ద నుంచి వైజాగ్ మారథాన్ నిర్వహించాయి. ముందుగా 21 కిలోమీటర్ల పరుగు, తర్వాత 10 కిలోమీటర్ల పరుగు, చివరగా 5, 3 కిలోమీటర్ల పరుగు ప్రారంభమైంది. ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఐదేళ్ల పిల్లల నుంచి ఆరు పదులు దాటిన వృద్ధుల వరకు ఇందులో భాగస్వాములయ్యారు. పలువురు విదేశీయులు సైతం పరుగు పోటీలో పాల్గొన్నారు. విద్యార్థులు బీచ్‌రోడ్డులో పరుగులు తీస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ నగరవాసులు వయోబేధం లేకుండా ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంధ్య మెరైన్ డైరెక్టర్ రమేష్, హైదరాబాద్ రన్నర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్ వెచ్చా, యూబీఐ జీఎం షాలినీ మీనన్, అపోలో హాస్పిటల్స్ ప్రతినిధి సీవోవో రామచంద్ర, యంగ్ ఇండియా ప్రతినిధులు, దివీస్ లేబొరేటరీ జీఎం ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు 10 రూపాయల నాణాలపై అవగాహన కల్పించారు. వైఎంసీఏ వద్ద ఏర్పాటు చేసిన పోలీసుల ప్రత్యేక బ్యాండ్ రన్నర్స్‌లో ఉత్సాహం నింపింది.

The City of Defence



విశాఖ తీరం.. రక్షణ కేంద్రం

కే–4 బాలిస్టిక్ మిసైల్ ప్రయోగంతో సత్తా చాటిన వైజాగ్

విశాఖలో తయారైన అరిఘాత్ సబ్‌మెరైన్ నుంచే ప్రయోగం

వచ్చే ఏడాది మరో న్యూక్లియర్ సబ్‌మెరైన్ జాతికి అంకితం

రూ.2,192 కోట్లతో ఈఎన్‌సీ పరిధిలో అభివృద్ధి పనులు

భారత నౌకాదళంలో కీలక ప్రాంతంగా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. అణ్వాయుధ పరీక్షల్లోనూ తనదైన ముద్ర వేస్తూ విశాఖ తీరంలో బాలిస్టిక్ మిసైల్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. షిప్‌లు, జలాంతర్గాములు, సర్వే వెసెల్స్ తూర్పు నౌకాదళంలో కేంద్రీకృతమవుతున్నాయి. న్యూక్లియర్ సబ్‌మెరైన్లకు కేంద్రంగానూ విశాఖ తీరం ప్రపంచాన్ని శాసిస్తోంది. సిటీ ఆఫ్ డెస్టినీ కాస్త.. సిటీ ఆఫ్ డిఫెన్స్‌గా రూపాంతరం చెందేలా ఏకంగా రూ.2,000 కోట్లకు పైగా నిధులతో తూర్పు నౌకాదళాభివృద్ధి పనులు మొదలయ్యాయి. కేవలం నౌకదళంలోనే కాకుండా త్రివిధ దళాలకు పెద్దన్న పాత్ర పోషించేలా విశాఖను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

సాక్షి, విశాఖపట్నం : చిన్న ఔట్‌పోస్ట్‌గా 1968లో ప్రారంభమై తూర్పు నావికాదళం ఇప్పుడు నౌకాదళంలో కీలకంగా ఎదిగింది. తూర్పు తీరం వెంబడి 2,562 కి.మీల విస్తీర్ణంలో స్థావరాలను ఏర్పాటు చేస్తూ తీర పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తోంది. దేశంలోని అన్ని సాయుధ దళాల కమాండ్‌లో భౌగోళిక పరంగా 'ది లార్జెస్ట్ కమాండ్'గా విస్తరించి ఉంది. ఈఎన్‌సీలో ప్రస్తుతం 37,000 మంది సిబ్బంది ఉండగా.. ఇందులో 2,895 మంది అధికారులు, 21,085 మంది నావికులు, 3,695 డీఎస్‌సీ సిబ్బంది, 9,689 మంది రక్షణ పౌరులున్నారు. భారత ప్రభుత్వం లుక్ ఈస్ట్ పాలసీ ప్రవేశపెట్టిన తర్వాత సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే నిర్వర్తిస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీఓ కార్యకలాపాలకు కూడా తూర్పు తీరమే వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీస్(ఎన్‌ఎస్‌టీఎల్) కూడా విశాఖలోనే ఉంది. ఇలా ఈఎన్‌సీ బలీయమైన శక్తిగా మారింది. అంతే కాదు నేవల్ ఎయిర్‌బేస్ ఐఎన్‌ఎస్ డేగాలో జెట్ ఫైటర్లు, మిగ్ 29–కేలపై శిక్షణ అందిస్తున్నారు. మెరైన్ కమాండోలకు శిక్షణ ఇచ్చేందుకు భీమిలి దగ్గరలో ఐఎన్‌ఎస్ కర్ణ, సబ్‌మెరైన్లలో పనిచేసే వారి శిక్షణకు ఐఎన్‌ఎస్ శాతవాహన, నౌకా నిర్మాణంలో ఆర్కిటెక్చర్, హోల్ మౌంట్, సెయిలర్లకు శిక్షణ కోసం ఐఎన్‌ఎస్ విశ్వకర్మ సేవలందిస్తున్నాయి.


త్రివిధ దళాలకు కేంద్ర బిందువుగా...

కేవలం నౌకాదళానికి మాత్రమే కాకుండా త్రివిధ దళాలకూ విశాఖ కేంద్ర బిందువుగా మారేందుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. సాధ్యాసాధ్యాలపై అధ్యయన కమిటీని కూడా ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజనకు ముందు విశాఖ నగరం నౌకాదళానికి, హైదరాబాద్ నగరం సైనిక దళానికి ప్రాతినిధ్యం వహించేవి. విభజన తర్వాత ఏపీలో కేవలం నేవీ మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ కేంద్రాలను కూడా విశాఖలో ఏర్పాటు చేసేందుకు రక్షణ శాఖ సిద్ధమవుతోంది. అగ్రరాజ్యం అమెరికా, రష్యా, చైనా మాదిరిగా త్రివిధ దళాలకు ఒకే కేంద్రం ఏర్పాటు కానుంది. ఇందులో భాగంగా 'థియేటర్ లెవెల్ కమాండ్'లు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇది ఏర్పాటైతే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ కలిసి ఉమ్మడి ఆపరేషన్స్ విశాఖలోనే నిర్వహించనున్నాయి.

37 ప్రాజెక్టులు.. రూ.2,192 కోట్లు

ఈఎన్‌సీలో సాంకేతిక మౌలిక సదుపాయాలు గణనీయమైన పురోగతిని సాధించే దిశగా రూ.2192 కోట్లతో 37 ప్రాజెక్టులు చేపట్టారు. రన్‌వేల భద్రతా నిబంధనలకు అనుగుణంగా విశాఖ విమానాశ్రయం రన్‌వే పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేశారు. అనుబంధంగా నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్‌ఎస్ డేగాలో ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇవి అందుబాటులోకి వస్తే భారత నౌకాదళం విశాఖ నగరానికి ప్రపంచ స్థాయి ఎయిర్‌ఫీల్డ్‌ను అందించనట్లు అవుతుంది.

కె-4 మిసైల్ ప్రయోగం జరిగిన తొలి నగరం



గత నెల 28న అణ్వాయుధ సామర్థ్యం గల బాలిస్టిక్ మిసైల్‌ను విశాఖ తీరంలో విజయవంతంగా నిర్వహించింది. విశాఖపట్నం షిప్‌బిల్డింగ్ సెంటర్‌లో నిర్మించిన న్యూక్లియర్ సబ్‌మెరైన్ ఐఎన్‌ఎస్ అరిఘాత్ నుంచి కే4 బాలిస్టిక్ మిసైల్‌ని పరీక్షించగా.. 3,500 కి.మీ రేంజ్‌ను అత్యంత వేగవంతంగా ఛేదించింది. భారత్ అణునిరోధక శక్తిని పెంచే సామర్థ్యం గణనీయంగా పెరిగి.. అగ్రదేశాలకు విశాఖ నుంచి సవాల్ విసిరింది. ఈ ప్రయోగంతో చైనాతో పోటీగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు సబ్‌మెరైన్ల నుంచి మిసైల్ దాడి చేయగల సామర్థ్యం ఆసియా దేశాల్లో కేవలం చైనాకు మాత్రమే ఉండేది. కే–4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం తర్వాత సబ్‌మెరైన్ నుంచి అణుదాడి చేయగల సామర్థ్యం కలిగి ఉన్న ఆసియా దేశాల్లో రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. భవిష్యత్‌లో మరో అణు జలాంతర్గామి భారత్ అమ్ములపొదిలోకి రానుంది. ఇది వస్తే 5000 కి.మీ రేంజ్ ఉన్న కే5 మిసైల్స్‌ను కూడా ప్రయోగించే సామర్థ్యం భారత్ సొంతం కానుంది.

ఆయుధ సంపత్తిలోనూ..

ఈఎన్‌సీ ఆయుధ సంపత్తి విషయంలోనూ బలోపేతమవుతోంది. ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ ముంబయి, ఐఎన్‌ఎస్ మైసూర్ యుద్ధ నౌకలు త్వరలోనే విశాఖ నుంచి కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న 20 నుంచి 25 యుద్ధ నౌకలు 2037 నాటికి తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో చేరనున్నాయి. ఇందులో నీలగిరి క్లాస్ ఫ్రిగేట్‌లు, నెక్స్ట్ జనరేషన్ కార్వెట్ క్లాస్ షిప్‌లు, డైవింగ్ సపోర్ట్ వెసెల్స్, సర్వే వెసల్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లు, వాటర్ క్రాఫ్ట్‌లు ఉన్నాయి. ఇప్పటికే నేవీ అమ్ముల పొదిలో న్యూక్లియర్ సబ్‌మెరైన్ ఐఎన్‌ఎస్ అరిఘాత్ వచ్చి చేరింది. మల్టీ రోల్ 60 ఆర్ 60 ఆర్ అప్‌గ్రేడ్ చేసిన యాంటీ సబ్‌మెరైన్ కమోవ్, 28 హెలికాప్టర్లు, మీడియం లిఫ్ట్ ఇ–295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా విశాఖలో కేంద్రీకృతం కానున్నాయి. భారత నౌకాదళానికి డైవింగ్ సపోర్టు షిప్‌లను హిందూస్థాన్ షిప్‌యార్డులోనే నిర్మిస్తుండటం విశేషం. ఐఎన్‌ఎస్ విక్రాంత్ సైతం విశాఖ కేంద్రంగా త్వరలోనే సేవలందించనుంది.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ఆదివారం చెప్పారు. రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఏజెన్సీ ప్రాంతం నుంచి విశాఖకు గంజాయి తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా జిన్నారం మండలం మంగంపేట గ్రామానికి చెందిన మన్నే జగదీష్, అల్లూరు సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ బొడ్డపుట్టి గ్రామానికి చెందిన తామర లవకుశలు పట్టుబడినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ టి.వి.విజయకుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్ట రీత్యా నేర మన్నారు. ఎవరైనా నిబంధనలు అతి క్రమిసే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.